## ఎస్సారెస్పీలోకి 19,500 క్యూసెక్కుల వరద



సాలూర వద్ద మంజీరా నదిలో వరద నీరు

మోర్తాడ్/ బోధన్ రూరల్/ జూలై 24: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువప్రాంతం నుంచి బుధవారం 19500 క్యూసెక్కుల వరద వచ్చి చేరినట్లు అధికారులు తెపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5టీఎంసీలు) కాగా 1071.3 అడుగుల (25.539 టీఎంసీలు) నీరు నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి 548 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది. రెండు మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు బోధన్ మండలంలోని వాగులు, చెరువులు జలకళ సంతరించుకుంటున్నాయి. సాలూర శివారులోని మంజీరా నదీలో వరద వచ్చి చేరుతున్నది.

**పొంగి ప్రవహిస్తున్న గోదావరి**

రెంజల్, జూలై 24 : మండలంలోని కందకుర్తి గోదావరినదిలో నీటి ప్రవాహం పెరగుతున్నది. తెలంగాణ – మహారాష్ట్ర ప్రాంతంలో నదిపై నిర్మించిన హైలెవల్ వంతెన వద్ద జలకళ సంతరించుకున్నది. నదిలోని శివాలయం గుడి చుట్టూ నీరు చేరింది. మండలంలో 13 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ తెలిపారు.

## నాన్‌టీచింగ్, వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది, ఐఎఫ్‌టీయూ నాయకులు

ఖలీల్‌వాడి, జూలై 24 : సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో నాన్ టీచింగ్, వర్కర్ల రెగ్యులరైజ్ ప్రక్రియ చేపట్టాలని కోరుతూ నాన్‌టీచింగ్ సిబ్బంది ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. వేతనాల పెంపు, ఇతర సమస్యలను పరిష్కరించాలని అంతకుముందు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. కేజీబీవీ మోడల్ స్కూల్ నాన్ టీచింగ్, వర్కర్లకు కనీస వేతనాలు అమలుచేయాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలని కోరారు. డ్యూటీచార్ట్ అమలు చేసి పనిభారం తగ్గించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ మోడల్ స్కూల్ నాన్ టీచింగ్ సిబ్బంది ఈశ్వరి, హేమలత, సుమలత, స్వరూప, మోతి, ఉమ, సుచేంద్ర, స్వర్ణలత, విజయలక్ష్మి, అనురాధ, జ్యోతి, మహేశ్వరి, గీత, సంధ్య, పద్మ, సువర్ణ, రజియా, సాయమ్మ, గోదావరి, లక్ష్మి పాల్గొన్నారు.

## గురుకుల కళాశాలల్లో సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

డిచ్‌పల్లి, జూలై 24 : సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈనెల 27న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ధర్మారం (బీ) గురుకుల పాఠశాల సమన్వయకర్త సత్యనారాయణ బుధవారం ప్రకటనలో తెలిపారు. మార్చి 2024లో ఉత్తీర్ణత సాధించిన బాలికలకు ఈనెల 26న, బాలురకు 27న ఉదయం 10 గంటల నుంచి ధర్మారం(బీ) గురుకుల కళాశాలలో కౌన్సెలింగ్ ద్వారా స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తామని తెలిపారు.

## జిల్లా కేంద్రంలో పోలీసుల మెరుపు దాడి

- **రూ.4 లక్షల నిషేధిత పాన్‌మసాల సీజ్**

వినాయక్‌నగర్, జూలై 24 : నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని బోధన్ బస్టాండ్ ఏరియాలో ఉన్న ఓ గోదాంపై బుధవారం రాత్రి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తన సిబ్బందితో కలిసి మెరుపు దాడులు చేశారు. ఓ హోటల్ పక్కన ఉన్న గోదాంలో నిషేధిత పాన్‌మసాలలు నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో దాడి చేసి, రూ.4లక్షల విలువ చేసే నిషేధిత పాన్‌మసాలను సీజ్ చేసినట్లు తెలిపారు. లీగల్‌గా వెళ్లి, గోదాం నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## 29న నిధి ఆప్కేనిఖత్ 2.0

కంఠేశ్వర్, జూలై 24 : పీఎఫ్ ఖాతాదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29న నిధి ఆప్కేనిఖత్ 2.0 నిర్వహించనున్నట్లు పీఎఫ్ కార్యాలయ ప్రాంతీయ కమిషనర్ గణేశ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని ఎల్లమ్మగుట్టలో ఉన్న మెడికవర్ దవాఖానతోపాటు తాడ్కోల్, బాన్సువాడ, కామారెడ్డి జిల్లాలో ఉన్న పద్మావతి ఆగ్రో ఇండస్ట్రీస్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పెన్షనర్లు హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

















